## అన్నంలో పురుగులు వస్తున్నయ్!

- ఆరెపల్లిలో రోడ్డుపై విద్యార్థుల ధర్నా


రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

ధర్మపురి, సెప్టెంబర్ 10 : ''మధ్యాహ్న భోజనంలో పురుగులు, రాళ్లు వస్తున్నయ్.. నిర్వాహకులను తొలగించాలని అధికారులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు చెప్పినా పట్టించుకున్న పాపాన పోలేదు'' అంటూ ధర్మపురి మండలంలోని ఆరెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోడ్డుపై ధర్నాకు దిగారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు బియ్యం సరిగా శుభ్రం చేయకుండా, నాణ్యత లేని కూరలు వండడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మధ్యాహ్న భోజన నిర్వాహకులను తొలగించాలని డిమాండ్ చేశారు.

ఒక్కొక్కటిగా బయటపడుతున్న అక్రమాలు

# వెలుగులోకి సీఎంఆర్‌ఎఫ్ స్కాం దందా!


జమ్మికుంటలోని సప్తగిరి హాస్పిటల్

- ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల సీఐడీ సోదాలు
- జమ్మికుంట సప్తగిరి దవాఖానలో విస్తృత తనిఖీలు
- ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు
- భారీగా దందా నడిపారని దర్యాప్తులో వెల్లడి?
- పలు ప్రైవేట్ దవాఖానల్లోనూ ఇదే దందా
- ఫేక్ బిల్లులతో స్వాహాపర్వం
- పెద్దపల్లి, కరీంనగర్‌లో మెజార్టీ దవాఖానల దందా
- హాస్పిటల్ వర్గాల్లో కలకలం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రైవేటు దవాఖానలు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్)ని కొల్లగొట్టాయా? నకిలీ బిల్లులు సృష్టించి అసలు రోగికే తెలియకుండా సొమ్ము చేసుకున్నాయా? ఇందుకోసం అడ్డదారులు తొక్కాయా?.. అంటే అవుననే సమాధానమే వస్తోంది. ఒకటి రెండు దవాఖానలు కాదు.. దాదాపు పది నుంచి పన్నెండు దవాఖానలు ఈ దందా నడిపినట్లు విమర్శలు వస్తుండగా.. ఈ అక్రమాలపై సీఐడీ పోలీసులు లాగుతున్న కూపీతో అనేక మంది పాపాలు బహిర్గతమవుతున్నట్లుగా తెలుస్తోంది. గతంలో ఒకటి, రెండుసార్లు వివిధ దవాఖానాల్లో సోదాలు నిర్వహించిన సీఐడీ అధికారులు.. మంగళవారం మరోమారు విస్తృత తనిఖీలు చేసినట్లుగా విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగా జమ్మికుంటలోని సప్తగిరి దవాఖానలో సోదాలు నిర్వహిచిన సీఐడీ పోలీసులు భారీగా అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారని తెలుస్తోంది. ఆ మేరకు మరిన్ని వివరాలు లాగేందుకు సదరు దవాఖానకు సంబంధించిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకోగా.. పెద్దపల్లి, కరీంనగర్‌లోని కొన్ని దవాఖానల్లోనూ తనిఖీలు చేసి రికార్డులు స్వాధీనం చేసుకున్న విషయం ప్రస్తుతం హాస్పిటల్‌వర్గాల్లో కలకలం రేపుతోంది.**

**- కరీంనగర్, సెప్టెంబర్ 10 ( నమస్తే తెలంగాణ ప్రతినిధి/జమ్మికుంట)**

చిన్న రోగాలకే వేల కొద్ది బిల్లులు వేసి పీల్చి పిప్పి చేసే.. పలు ప్రైవేట్ దవాఖానలు చివరకు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్)ని కూడా వదిలి పెట్టలేదు. ఫేక్ బిల్లులు సృష్టించి అందినకాడికి దోచుకున్నాయి. ఈ వ్యవహారం రూ.కోట్లలోనే ఉంటుందని తెలుస్తోంది. ఆపన్నలకు అండగా నిలువాలన్న లక్ష్యంతో సీఎంఆర్‌ఎఫ్ పనిచేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో.. దరఖాస్తు చేసుకున్న రోగుల ఆర్థిక పరిస్థితులను పరిగణలోకి తీసుకొని సాధ్యమైన మేరకు ప్రభుత్వం సహాయం అదించింది. ఈ క్రమంలో చాలా మంది రోగులు.. ఎమ్మెల్యేలను కలిసి సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యేలు సైతం వాటిని మంజూరు చేయించి, చెక్కులను బాధితులకు అందించారు. అయితే, సీఎంఆర్‌ఎఫ్ ఉదారతను అవకాశంగా మలుచుకున్న కొన్ని ప్రైవేట్ దవాఖానల నిర్వాహకులు ఫేక్ బిల్లులు సృష్టించి.. నిధులు కొల్లగొట్టారని తెలుస్తోంది. నిజానికి ఈ ఆరోపణలు గతంలోనే రాగా, తీవ్రంగా పరిగణించిన అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీఐడీ పోలీసుల ద్వారా విచారణకు ఆదేశించింది. ఆ మేరకు.. సాగుతున్న విచారణ ప్రస్తుతం తుది దశకు చేరుకుందని తెలుస్తోంది. నిజానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు పది, పన్నెండు ప్రైవేట్ దవాఖానలు ఈ దందాకు పాల్పడ్డాయని తెలుస్తోంది. ఆరోపణలు వచ్చిన దవాఖానాల్లో గతంలోనే సీఐడీ అధికారులు విచారణ జరిపారు. ఆ మేరకు వివరాలు సేకరించారు. వాటి అధారంగా కూపీ లాగుతున్న నేపథ్యంలో ఒక్కో దవాఖాన అక్రమాలు ఆధారాలతో సహా బహిర్గతమవుతున్నాయి.

### స్పీడ్ పెంచిన సీఐడీ

గతంలో సేకరించిన పలు ఆధారాలను పరిగణలోకి తీసుకున్న సీఐడీ పోలీసులు.. తుది అంకంలో ఉన్నట్లు తెలుస్తోంది. తప్పు చేసిన వారికి శిక్ష పడేలా.. సదరు పోలీసు అధికారులు తమ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగానే.. మంగళవారం పెద్దపల్లి, కరీంనగర్‌లోని పలు దవాఖానాల్లోనూ తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. ఆ మేరకు.. జమ్మికుంటలోని సప్తగిరి దవాఖానలోనూ సోదాలు నిర్వహించారు. ఇద్దరు సీఐలతోకూడిన బృందం... కొన్ని గంటల పాటు.. ఈ దవాఖానలో రికార్డులను పరిశీలించినట్లు తెలుస్తోంది. అంతేకాదు.. ఒకే కేసు నంబర్‌తో సీఎంఆర్‌ఎఫ్ కొల్లగొట్టినట్లుగా గుర్తించిన పలు రికార్డులను సైతం సీజ్ చేశారని తెలుస్తుండగా.. ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లుగా అత్యంత విశ్వసనీయ సమాచారం ద్వారా తెలుస్తోంది. మంగళవారం జరిగిన సోదాల్లో ఈ దవాఖానలో భారీగా అక్రమాలు జరిగినట్లు సమాచారం అందుతుండగా.. అదుపులోకి తీసుకున్న వ్యక్తి ద్వారా మరింత కూపీ లాగుతున్నారని తెలుస్తోంది. నిజానికి ఈ దవాఖాన ఇప్పటికే పలు వివాదాలకు కేరాఫ్‌గా ఉంది. ఈ నేపథ్యంలో.. మళ్లీ సీఎంఆర్‌ఎఫ్‌కు సంబంధించిన అక్రమాలు ఇదే దవాఖానలో వెలుగు చూడడంతో అసలు ఈ దవాఖాన పరిధిలో ఏమి జరుగుతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదుపులోకి తీసుకున్న వ్యక్తితోపాటు దవాఖానకు చెందిన పలువురు నిర్వాహకుల నుంచి వివరాల రాబట్టిన సీఐడీ అధికారులు లిఖితపూర్వకంగా కూడా స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు తెలుస్తోంది. సీఐడీ పోలీసు వర్గాల నుంచి వస్తున్న సమాచారం ప్రకారం చూస్తే.. ఈ దవాఖానపై సీరియస్ యాక్షనే ఉంటుందని సమాచారం. కాగా. పెద్దపల్లితోపాటు.. కరీంనగర్ పట్టణంలోని కొన్ని దవాఖానలపైనా సీఐడీ పోలీసులు మంగళవారం ఏక కాలంలో సోదాలు చేశారని తెలుస్తోంది. ఇందులోనూ మూడు దవాఖానల నుంచి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారని సమాచారం. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేస్తున్నారు. మరోవైపు.. ఇదే కోణంలో మరికొన్ని దవాఖానలు ఉన్నాయని, వాటి నుంచి కూడా వివరాలు సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఒక అధికారి తెలిపారు. అయితే, ఓవరాల్‌గా చూస్తే.. సీఎంఆర్‌ఎఫ్ పేరుతో రూ.కోట్లు కొల్లగొట్టినట్లు తెలుస్తుండగా.. సీఐడీ పోలీసులు నిక్కచ్చిగా ముందుకు వెళ్తారా? లేక ఇంకా ఎవరి ఒత్తిళ్లకైనా తలొగ్గుతారా? అన్నది మున్ముందు తేలుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు.. సీఎంఆర్‌ఎఫ్ కొల్లగొట్టిన ప్రైవేటు దవాఖానలపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది.

లెప్రసీ సర్వే నిధులపై రగులుతున్న రగడ

# వైద్య శాఖలో నిధుల మాయ?


లెప్రసీ సర్వే చేస్తున్న ఆశ కార్యకర్త

- జిల్లాలకు పంపామంటున్న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ
- తమకు రాలేదంటున్న జిల్లా అధికారులు
- మధ్యలోనే మింగేశారంటున్న ఆశా కార్యకర్తలు
- సమరం చేసేందుకు సిద్ధమవుతున్న యూనియన్లు
- ఇప్పటికే కార్యాచరణ పూర్తి
- త్వరలో డీఎంహెచ్‌వో కార్యాలయాల ముట్టడికి నిర్ణయం
- అధికారులు అబద్ధాలు చెబుతున్నారు : సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు పీ జయలక్ష్మి

**కుష్టు వ్యాధి రోగులను గుర్తించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా రెండు సార్లు ఆశా కార్యకర్తలు చేసిన సర్వే కోసం ఇవ్వాల్సిన నిధుల విషయంలో రగడ నడుస్తోంది. వీటిని జిల్లాలకు విడుదల చేశామని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖాధికారులు చెబుతుండగా.. సదరు నిధులు తమకు రాలేదని జిల్లా అధికారులు సెలవిస్తున్నారు. దీంతో.. సర్వే చేసిన ఆశా కార్యకర్తలు ఈ వ్యవహారంపై తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లా వైద్యారోగ్యశాఖాధికారులకు వినతిపత్రాలు అందజేసిన యూనియన్లు.. ఈ వారంలో ఆందోళన క్యార్రమాలను నేరుగా చేపట్టాలని నిర్ణయించాయి. అయితే, జిల్లాల వైద్యశాఖాధికారులే వచ్చిన నిధులను మాయం చేసి మాయ మాటల చెబుతున్నారని యూనియన్లు విమర్శించడంతోపాటు. ఆశా కార్యకర్తలకు రావాల్సిన సర్వే డబ్బులు ఇప్పించేందుకు జిల్లా కార్యాలయాలను ముట్టడిస్తామని స్పష్టం చేస్తున్నాయి.**

**- కరీంనగర్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి/కమాన్‌పూర్)**

### రెండుసార్లు సర్వే

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో కుష్టు రోగులను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే (కాంపెయిన్) కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 2023 ఆగస్టు 16 నుంచి 31వ తేదీ వరకు మొదటిసారి ఈ సర్వే జరిగింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 26,673 మంది ఆశ కార్యకర్తలను వినియోగించారు. అన్ని ఖర్చులు కలుపుకొని ఒక్కో ఆశ కార్యకర్తకు రూ.1407 చొప్పున చెల్లించడానికి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం రూ.3,75,47,050 కేటాయిస్తూ కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులు 2023 జూలై 17న ఉత్తర్వులు జారీచేశారు. అంటే సర్వేకు ముందుగానే ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే, ఈ ఏడాది మార్చి 11 నుంచి 24వ తేదీ వరకు రెండోసారి సర్వే జరిగింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 28,160 మంది ఆశ కార్యకర్తలను వినియోగించగా, వీరికి రూ.1400 చొప్పున చెల్లించడానికి రూ.3,94,24,100 కేటాయిస్తూ ఫిబ్రవరి 5న ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం చూస్తే.. సర్వేకు ముందుగానే రెండు సార్లు నిధుల కేటాయింపులు జరిగాయి. ఆ మేరకు.. ఆయా జిల్లాల వారీగా సర్వేకు వినియోగించే ఆశ కార్యకర్త, వారికి చెల్లింపులు, అవసరమైన నిధుల వంటి పూర్తి వివరాలను పేర్కొంటూ జిల్లా వైద్యాధికారులకు ఉత్తర్వులు వచ్చాయి. ఇందులో భాగంగానే కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోనూ సర్వే జరిగింది. ఉమ్మడి జిల్లా విషయానికి వస్తే మొదటిసారి జరిగిన సర్వే కోసం 2,388 మంది ఆశ కార్యకర్తలను వినియోగించారు. వీరి కోసం రూ.34,09,500ల నిధులు కేటాయించారు. అలాగే, రెండో సారి 2,388 మందినే వినియోగించగా వీరికోసం రూ.34,15,500 కేటాయించారు.

### ఆశ కార్యకర్తల దోళన

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆశ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించి సర్వే చేశారు. ఈ సమయంలో ప్రభుత్వం అత్యంత కఠినమైన నిబంధనలు పెట్టింది. అత్యవసరమైతే తప్ప ఎవరూ సెలవు తీసుకోరాదని, సర్వేలో ఖచ్చితంగా పాల్గొని పకడ్బందీగా చేయాలని, ఎక్కడ తప్పులు దొర్లినా చర్యలు తీసుకుంటామని, నిర్దిష్ట ఫార్మెట్‌లో నిర్దిష్ట కాలంలో పూర్తిచేయాలని ఆదేశించింది. ఆ మేరకు.. ఆశ కార్యకర్తలు వృత్తి నిబద్ధతను కనపరిచారు. సమయం తక్కువగా ఉన్నా ఇచ్చిన గడువులోపు సర్వే పూర్తి చేశారు. నిబద్ధతతో పనిచేసిన ఆశ కార్యకర్తలకు ఇవ్వాల్సిన పేమెంట్ విషయంలో మాత్రం ఆలస్యం జరుగుతోంది. సర్వేలో పాల్గొన్న ఒక్కో ఆశ కార్యకర్తలకు రెండుసార్లు కలిపి దాదాపు రూ.2800 వరకు వస్తుంది. కానీ, నేటి వరకు ఒక్కపైసా వారికి ముట్టలేదు. తమకు రావాల్సిన సర్వే డబ్బులు ఇప్పించాలని కోరుతున్నా.. తమకు సమాచారం లేదంటూ ఇన్నాళ్లూ జిల్లా వైద్యాధికారులు దాటవేస్తూ వచ్చారు. దీంతో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆశ కార్యకర్తలు సీఐటీయూ యూనియన్‌ను ఆశ్రయించగా.. సదరు యూనియన్ నాయకులు ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర కార్యాలయం నుంచి తీసుకున్నారు. రెండు సార్లు సర్వేకు సంబంధించి జిల్లాల వారీగా కేటాయించిన నిధులు, మంజూరైన ఉత్తర్వులను సంపాదించిన యూనియన్ నాయకులు వాటిని ఆశా కార్యకర్తలందరికీ పంపించారు. ఇది చూసిన ఆశావర్కర్లు తాజాగా.. సదరు ఉత్తర్వులను జతచేస్తూ తమకు సర్వే డబ్బులు ఇప్పించాలని కోరుతూ అన్ని జిల్లాల డీఎంహెచ్‌వో అధికారులను కలసి వినతిపత్రం సమర్పించారు. అయినా, అధికారుల నుంచి గానీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి గానీ ఎలాంటి స్పందనా కానరావడం లేదు. ఈ నేపథ్యంలో.. సర్వే డబ్బుల కోసం సమరం సాగించాలని నిర్ణయించిన ఆశా కార్యకర్తలు కార్యాచరణకు పూనుకున్నారు. మూడు, నాలుగు రోజుల్లో ప్రభుత్వం నుంచి గానీ, అధికారులనుంచి గానీ స్పందన రాకపోతే.. ముందుగా అన్ని జిల్లాల్లో డీఎంహెచ్‌వో కార్యాలయాలను ముట్టించాలని నిర్ణయం తీసుకున్నారు. అప్పటికీ స్పందించకపోతే హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అయితే, ఇదే విషయంపై సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు పీ జయలక్ష్మి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. సర్వేకు సంబంధించిన డబ్బుల డీఎంహెచ్‌వోలకు పంపినట్లుగా రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖాధికారులు చెపుతున్నారని, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను కూడా తమకు ఇచ్చారన్నారు. అయితే, జిల్లాల్లో మాత్రం డీఎంహెచ్‌వోలు ఈ విషయంలో అబద్ధాలు చెప్పడమే కాకుండా..వచ్చిన నిధులను మాయంచేసి మాయ మాటలు చెపుతున్నారని విమర్శించారు. అందుకే ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నామని, సర్వే చేసిన ఆశా కార్యకర్తలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని, ఇందు కోసం ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. నిధులు కేటాయించి, జిల్లాలకు ఉత్తర్వులు జారీచేసినట్లుగా చెపుతున్న రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ.. సంబంధిత నిధు టలు విడుదల చేశారా? లేదా?, చేస్తే అవి ఏమైనట్లు?, ఒక వేళ విడుదల చేయకపోతే.. ఎప్పుడు విడుదల చేస్తారో స్పష్టమైన క్లారిటీ ఇస్తే. తప్ప ఈ రగడ ఆగదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఆశావర్కర్లు ఆందోళన బాట పడితే క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్న అభిప్రాయాలు వస్తున్నాయి.


పెద్దపల్లి డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

# ప్రజారోగ్యం పట్టదా..?

- జ్వరాలతో అల్లాడుతున్నా నిర్లక్ష్యమెందుకు..?
- ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలన్నీ నీటి మూటలేనా..?
- ప్రతి హామీని నిలబెట్టుకోవాలి
- అభివృద్ధి, ఆరోగ్యంలో కేసీఆర్‌తో మీకు పోలికేలేదు
- తొమ్మిది నెలల్లోనే రాష్ట్రాన్ని ఆగంబట్టిచ్చిన్రు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో పర్యటన

వెల్గటూర్, సెప్టెంబర్ 10: 'ఎన్నో మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలన గాడి తప్పింది. పల్లె, పట్టణాల్లో పారిశుధ్యం లోపించి ప్రజలు జ్వరాలతో అల్లాడిపోతున్నారని, దవాఖానల్లో వసతులు, మందులు లేక ఇబ్బందులు పడుతున్నా ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి కనీస పట్టింపులేకుండా పోయింది' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్, ఎండపల్లి మండలంలో ఇటీవల విష జ్వరాలతో పలువురు మృతిచెందగా, వారి కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. వెల్గటూర్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో అభివృద్ధి జరుగలేదని విష ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, ఎన్నికల ముందు వారు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఇప్పుడూ గత ప్రభుత్వం పైనే విమర్శలు చేస్తూ కాలం గడుపుతున్నారని ధ్వజమెత్తారు. ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా పాలన గాలికొదిలేశారని, ఫలితంగా గ్రామాల్లో పారిశుధ్యం లోపించి డెంగ్యూ, చికున్ గున్యా లాంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాష్ట్రం జ్వరాల కుప్పగా తయారైందని, గత ఏడెనిమిదేండ్లలో ఒక్క డెంగ్యూ కేసైనా నమోదైందా..? ఆలోచించాలని ప్రజలకు సూచించారు. ప్రజలు జ్వరాలతో సతమతమవుతున్నారని, ప్రభుత్వ దవాఖానలకు వెళితే వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, వేలకు వేలు ఖర్చు చేస్తూ ప్రైవేట్ దవాఖానలకు వెళ్తుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కనీస పట్టింపులేకుండా పోయిందని, ఆయనకు ప్రతి పక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అయితే నియోజకవర్గాల్లో సొంత పనులు చేసుకుంటున్నారని, ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వైద్యులు, అధికారులతో రివ్యూ సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరిచి, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇక ఒకప్పుడు ప్రసవాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ప్రభుత్వ దవాఖానలు ఇప్పుడు డీలా పడిపోయాయని, నిర్వహణ లేక ప్రసవాల సంఖ్య 70 నుంచి 30 శాతానికి పడిపోయిందన్నారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ల జాడే లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ నాయకులు అడ్డం, పొడుగు మాట్లాడడం ఆపేయాలని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకొని ప్రజలకు భరోసాగా నిలవాలని సూచించారు. అనంతరం ఎండపల్లి మండలం గుల్లకోటకు చెందిన సాన మారుతి, జయకర్, భీమవ్వ, వెల్గటూర్ మండలం స్థంభంపల్లికి చెందిన అవ్వ లింగయ్య, వెల్గటూర్‌కు చెందిన బుచ్చయ్య మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు చల్లూరి రాంచందర్‌గౌడ్, సింహాచలం జగన్, ప్రధాన కార్యదర్శి జుపాక కుమార్, నాయకులు ఏలేటి చంద్రరెడ్డి, మూగల సత్యం, గాజుల మల్లేశం, అనుమాల తిరుపతి, బందెల నర్సయ్య, పోడేటి రవి, పొన్నం తిరుపతి గౌడ్, కుషనపల్లి రవి, చుంచు మల్లేశ్, గాజుల భానేశ్, రామగిరి మల్లేశ్, మేర్గు అశోక్, జాన్ ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు, పక్కన కార్పొరేటర్లు, నాయకులు

# పొన్నం నీ పవర్ ఏమైంది..?

- స్థానికుడిని అంటావ్.. మరి నిధుల మంజూరేది..?
- తొమ్మిది నెలల కాలంలో ఒక్క రూపాయైనా తెచ్చినవా..?
- ఫండ్స్ తెచ్చుడు చేతకాకపోతే గత ప్రభుత్వ సీఎం అస్యూరెన్స్ నిధులైనా విడుదల చేయించు
- సమీక్షలతో కాలం వృథా ఎందుకు చేస్తున్నవ్..
- నీవు కరీంనగర్‌కు మంత్రివా..? సిద్దిపేటకా..? చెప్పాలి
- కరీంనగర్ మేయర్ సునీల్‌రావు ఫైర్

కొత్తపల్లి, సెప్టెంబర్ 10: 'మాట్లాడితే చాలు పవర్ ఫుల్ మంత్రిని అని చెప్పుకొనే రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పవర్ ఏమైంది. ఎటు పోయింది..? స్థానికుడిని అంటున్నవ్. అధికారులతో సమీక్షలు పెడుతున్నవ్. మరి కరీంనగరానికి నిధులు ఎందుకు మంజూరు చేయిస్తలేవు. అసలు నువ్వు కరీంనగర్ జిల్లాకు మంత్రివా..? సిద్దిపేట జిల్లాకా చెప్పాలని' కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావు ప్రశ్నించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఒకవేళ పొన్నం ప్రభాకర్ కరీంనగర్ జిల్లాకే మంత్రి అయితే ప్రభుత్వం నుంచి రూ.100 కోట్లు నిధులు విడుదల చేసి ఆయన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిది నెలల కాలంలో ఈ రోజు వరకు కరీంనగర్ బల్దియాకు ఒక్క రూపాయి నిధులు విడుదల చేయలేదని, అభివృద్ధి కుంటుపడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. కరీంనగర్ ప్రాంతానికి చెందిన వ్యక్తినని చెప్పుకుంటున్న మంత్రి పొన్నం నిధులు విడుదల చేయక ఎందుకు వివక్ష చూపుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. మూడు నెలల క్రితం నగరపాలక సంస్థపై పొన్నం నిర్వహించిన సమీక్షతో నగరానికి ఒరిగిన ప్రయోజనం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ అభివృద్ధిపై ఏ మాత్రం చిత్తశుద్ధి లేని మీరు సమీక్షలు చేయడం ఎందుకని ప్రశ్నించారు. కొత్తగా నిధులు తీసుకురాకపోవడం చేతకాకపోతే గత ప్రభుత్వంలోని సీఎం అస్యూరెన్స్ నిధులనైనా విడుదల చేయించాలని సూచించారు. రోజువారీ పనుల కోసం కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో నగరంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయన్నారు. కరీంనగర్‌లో అభివృద్ధి అంటే అది రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేండ్లలో జరిగిందే తప్ప, కాంగ్రెస్ హయాంలో జరిగిందేమీ లేదన్నారు. అప్పటి మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ సహకారంతో కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ హోదా దక్కడంతో పాటు రూ.వెయ్యి కోట్ల నిధులు వచ్చాయన్నారు. ఇందులో రూ.800 కోట్లతో అభివృద్ధి వేగంగా జరిగిందన్నారు. దీనికి తోడు గంగుల, వినోద్‌కుమార్ సహకారంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.600 కోట్లు ప్రత్యేక నిధులు విడుదల చేసి కరీంనగర్ అభివృద్ధికి పాటుపడ్డారన్నారన్నారు. గతంలో పొన్నం ప్రభాకర్‌ను కరీంనగర్ ప్రజలు ఓడించడంతోనే నగరానికి నిధులు ఇవ్వడం లేదని భావించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెప్పారు. కరీంనగర్ ప్రజలకు సమీక్షలు అవసరం లేదని, అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. తాను పార్టీ మారుతారన్న ప్రచారంలో ఏ మాత్ర నిజం లేదని, అవన్నీ ఊహాగానాలు మాత్రమేనని, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నాయకత్వంలో ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామన్నారు. స్మార్ట్‌సిటీ నిధుల విడుదలలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి ఎలాంటి అడ్డంకులు సృష్టించకపోవడంతోనే ఆయనను కలిసి కృతజ్ఞతలు చెప్పానని, ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# సర్కారు నిర్లక్ష్యం.. దవాఖాన నిరుపయోగం

- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.12కోట్లతో నిర్మాణం
- వంద పడకల సామర్థ్యంతో ఏర్పాటు
- గతేడాదే ప్రారంభించినా అందుబాటులోకి రాని వైద్యశాల
- ప్రస్తుత పాత హాస్పిటల్‌లోనే సేవలు
- సీజనల్ వ్యాధులతో పెరుగుతున్న తాకిడి

కోరుట్ల, సెప్టెంబర్ 10: సర్కారు వైద్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ ప్రజారోగ్యంపై పట్టనట్లు వ్యవహరిస్తున్నది. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నిర్ణయించిన గత ప్రభుత్వం, కోరుట్లలో దాదాపు రూ.12 కోట్లు వెచ్చించి ఆధునిక వసతులతో వంద పడకల దవాఖానను నిర్మించి, గతేడాది ప్రా రంభించగా, ఇప్పటికీ అందుబాటులోకి తేకపోవడం నిర్లక్ష్యానికి అద్దంపడుతున్నది. పూర్తి స్థాయి వైద్య సిబ్బంది లేక, పరికరాలు సమకూర్చకపోవడంతో ఏడాదిగా నిరుపయోగంగానే ఉంటోంది. ప్రస్తుతం వైరల్ ఫీవర్లతో నిత్యం వందలాది మంది రోగులు వస్తుండగా, పాత 30 పడకల వైద్యశాలే దిక్కుగా మారింది. అయితే వందలాది మంది రోగు లు వస్తుండడంతో మెరుగైన వైద్యం అంద డం లేదు. ఫలితంగా ప్రైవేట్‌ను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించగా, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని పేద, మధ్య తరగతి ప్రజానీకం డిమాండ్ చేస్తున్నది.

### పెరుగుతున్న తాకిడి

వానాకాలం కావడంతో సీజనల్ వ్యాధు లు విజృంభిస్తుండగా, కోరుట్ల పట్టణంలోని పాత 30 పడకల దవాఖాకు రోగుల తాకిడి పెరుతున్నది. కోరుట్ల పట్టణం, పరిసర గ్రా మాల నుంచి నిత్యం వందలాది మంది జ్వర పీడితులు వస్తున్నారు. కొద్ది రోజులుగా 400 మంది వరకు ఓపీ ఉంటుంది. ఎక్కువగా వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ క్యూ కడుతుండగా, పూర్తిస్థాయిలో వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. అయితే వంద పడకల ఏరియా దవాఖాన అందుబాటులోకి వస్తే ఈ పరిస్థితి ఉండేదికాదని, ఇప్పటికైనా ప్రభు త్వం స్పందించి దవాఖానలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థోపిడిషియన్ వైద్యులను నియమించి, పరికరాలను ఏర్పాటు చేసి సేవలు అందించాలని పేద ప్రజలు కోరుతున్నారు. రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంటే ఎలా..? మరీ ఇంత నిర్లక్ష్యం వద్దని సూచిస్తున్నారు.


నిరుపయోగంగా కోరుట్ల ప్రభుత్వ ఏరియా వంద పడకల దవాఖాన


కోరుట్ల ప్రభుత్వ దవాఖానలో బారులు తీరిన జ్వర పీడితులు